# మమతకు హద్దులు

ఇద్దరి వేలి ముద్రలు ఒకేలా ఉండవు. రెండు గడియారాలు ఒకేలా నడవ్వు. ఇద్దరి అభిప్రాయాలూ అంతే. స్థూలంగా ఈ సూత్రాన్ని నేను కూడా స్వీకరించినవాణ్ణే. ఒక జీవిత సత్యాన్ని చూసి అమాయకంగా ఇద్దరు వ్యక్తులు ఒకేలా స్పందించడం నా కెంతో ఆశ్చర్యకరంగానే నేటికీ జ్ఞాపకాల్లో మిగిలిపోయింది.

అసలేమైందంటే-

నా మరదలు పిల్ల పెళ్ళికి ముహూర్తం పెట్టారని ఉత్తరం రాగానే ఆలుబిడ్డల్ని అత్తవారి ఊళ్లో వదిలి వచ్చాను. ఆ తర్వాత ఆఫీసు పనిమీద పది రోజులు ఊళ్లు పట్టిపోయి, అదే రోజు ఉదయం తిరిగి వచ్చి ఆఫీసులో అడుగుపెట్టాను.

మధ్యాహ్నం అదేపనిగా మా సెక్షన్‌లో ఫోను మోగింది. తల ఎత్తి చూశాను. రిసీవర్ని పట్టుకుని మా సెక్షన్ హెడ్ నన్ను కళ్లతో పిలిచి, "ఈవిడెవరో కానీ నాలుగు రోజుల్నించీ నీ కోసం ఫోను చేస్తున్నారు" అన్నాడు.

ఆత్రుతగా ఆ రిసీవర్ని అందుకుని నా పేరు చెప్పగానే "హమ్మయ్యా! రక్షించావు. నీ కోసం రోజూ ఫోన్ చేస్తూనే ఉన్నాను" అంది కాత్యాయని.

నాకామె దూరపు బంధువే కానీ రామం నాకు స్నేహితుడు కావడంతో ఆ బంధుత్వం ఇంకా బిగిసింది.

"మా వారికి స్వల్పంగా హార్ట్ ఎటాక్ వచ్చి ఆసుపత్రిలో చేర్పించాం. మా పక్కింటి వాళ్లు నా పిల్లల్ని రాత్రి పూట చూసుకుంటూ ఉంటే నేను ఆయనకి తోడుగా వార్డులో పడుకుంటున్నాను. ఒక్కర్తినే చాలా హైరానపడిపోయాను. నీకు పుణ్యముంటుంది కాస్త నైట్ డ్యూటీ చెయ్యాలి" అని, నా మాటల కోసం ఆశగా వింటోంది.

నాకు తోచిన మాటలతో గట్టిగా ధైర్యం కలిగించి, ఆఫీసునుంచి కాసింత వేగంగానే ఆసుపత్రికి బయలుదేరాను.

వాచ్‌మన్ అడ్డుపడలేని ఆ సమయంకోసం ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్న జనం

ఒక్కమారుగా వెల్లువలా లోనికి దూసుకుపోతున్నారు. లోపల మంచాల మీదున్న రోగుల్ని చూడడానికి స్నేహితులూ, బంధువులూ పడే ఆరాటమంతా ఆ గేటు దగ్గర తొక్కిసలాటలో కనిపిస్తోంది. నేనుకాగితం మీద రాసుకున్న వార్డు నెంబరు, అంతస్తు, మంచం సంఖ్య ఒకమారుచూసుకుని లోనికి పోయాను.

లిఫ్ట్ నడుస్తున్న సూచనలేదు. పక్కనే ఉన్న మెట్లు ఎక్కుతూఉంటే నా కంటే రెండు మెట్లు మీదనే ఉన్నాడొక కుర్రవాడు. ఏడేళ్లు మించే ప్రాయం కాదు. ఒక చేత్తో ఫ్లాస్క్, ఇంకో చేత్తో సంచీ పట్టుకుని ఆయాసపడిపోతున్నాడు. వాడు భూమికి జానెడుంటే ఆ సంచీ వాడి ఎత్తులో సగం ఉంది. బరువుగా ఉండి మెట్లకు కొట్టుకొంటోంది. అలా ఆ సంచీ మెట్లకు తగలకుండా ఎక్కే ప్రయత్నంలో ఎంతో ప్రయాసపడిపోతున్నాడు.

ఆ సంచీని నేను అందుకుని- "నువ్వు మెట్లెక్కిన తర్వాత ఇస్తాలే పద!" అన్నాను.

నావేపు నిశితంగా చూసి భరోసాతో ఆ సంచీని నా చేతిలో వదిలి మెట్లన్నీ ఎక్కాడు. మొదటి అంతస్తు రాగానే వాడి సంచీ వాడికిచ్చి నేను వెళ్ళవలసిన వార్డు దిశగా సాగిపోయాను. వాడి కళ్లలో ఏదో ఆనందం. నా మనసులో ఏదో వింత తృప్తి.

రామం ఒక్కడూ మంచం మీద చిద్విలాసంగా కూర్చున్నాడు. నున్నగా గడ్డం గీసుకున్నాడు. ఇచ్చిన మందూ మాకూ వంటపట్టినట్టుంది. చెప్తే కానీ తెలియదు గుండె దడతో ఆసుపత్రిలో చేరినట్లు. ఆ రోగానికి ఉన్న ప్రత్యేకతే అది కాబోలు. వాతావరణాన్ని తేలిక పరిచే ధోరణిలో మంచం దండి మీద ఒక పక్కగా కూర్చుంటూ- "నేను ఊళ్ళో లేకుండా చూసి కాత్యాయనిని హడలు కొట్టించేశావటగా" అన్నాను.

"రెండు రోజులు ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి తర్వాత ఇక్కడికి తరలించారు. ఇంకో రెండు మూడు రోజుల్లో ఇంటికి పోవచ్చునన్నారు" రామం మెల్లగా జవాబిచ్చాడు.

"రాత్రి నిద్ర పడుతుంది కదా!"

"ఓ! దానికేమీ లోటు లేదు. రాత్రి తొమ్మిదికి ఆహారం తీసుకుని మాత్ర వేసుకుని పడుకుంటే, ఉదయం ఐదో ఆరో కొట్టేదాకా పడ్డదేపాటు. ఇక లోకమేమైనా తెలియదు. అవస్థంతా కాత్యానిదే ఏమున్నా.."

"అలా నిద్రపోతే ఆ విశ్రాంతిలో వేగం కోలుకుంటావు. నీకో సంగతి చెప్తే ఆశ్చర్యపోతావు. నాకు వేలు విడిచిన మేనమామ ఉన్నాడు. అతనికి నలభై ఏడేళ్లకు హార్ట్.ఎటాక్ వచ్చింది. డాక్టర్లు ఇచ్చిన సలహాలు పాటిస్తూ ఇప్పటికీ హాయిగా ఉన్నాడు. అతనికి డెబ్భై ఎనిమిదేళ్లు. ఇలాటి వ్యవహారంలో ఆత్మబలం పెంచుకోవడమే ప్రధానం" అంటూ ఉంటే, వార్డులోకి వస్తున్న కాత్యాయని కనిపించింది.

వారం రోజులుగా ఆమె పడ్డ హైరాన, నీరసం, అలసట మొహంలో కనిపిస్తున్నాయి.

నన్ను చూడగానే మొహంలో విరిసిన ధైర్యం కూడా స్పష్టంగా చూడగలిగాను. చిన్న పిల్లలతో ఎలా సతమతమైపోయిందో, పక్కింటావిడ తన పిల్లల్ని రాత్రిపూట ఎలా జాగ్రత్తగా సంబాళించుకుందో వివరించింది.

"ఆసుపత్రికి ఇల్లు మరీ దూరంగా లేకపోవడం గుడ్డిలో మెల్ల. నర్సునో, పక్క మంచం దగ్గర ఉన్న వాళ్లనో బ్రతిమాలుకుని రామాన్ని చూడమని చెప్పి ఇంటికి వెళ్లి రాగలుగుతున్నాను రెండు రోజులై" అని తన కష్టాలు నెమ్మదిగా ఏకరువుపెట్టింది. చిన్న మూడు గిన్నెల క్యారేజి కబ్బర్డ్‌లో ఉంచింది.

"ఇందులో చపాతీలు, కాస్త పెరుగు అన్నం కలిపి నీకోసం ఉంచాను" అని అప్పగించింది.

రామంతో కాస్తసేపు కాత్యాయని మాట్లాడుకునే అవకాశం కల్పిస్తూ అటూ ఇటూ నాలుగడుగులు వేసి వార్డు నంతా కలయజూశాను. వార్డు చివరగా ఒక మూల వాష్ బేసినుంది. ఇంకో చివర స్టాఫ్ నర్సులు కూర్చునే కుర్చీలూ, టేబుల్తూ, పక్కనే డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గది, వార్డు మధ్యగా నడిచేదారి, కుడి ఎడమలుగా మంచాలు.

రామం పక్కనే ఉన్న మంచంమీద మంచం పొడవును ఆక్రమించుకొని ఆజానుబాహుడు పడుకున్నాడు. పెరిగిన గడ్డం, మీసం, ముక్కులోకి ప్రాణవాయువుని అందిస్తున్న గొట్టాలు. అతని మొహానికి దగ్గరగా మొహం వంచి నల్లటి బురఖాలో ఉన్న స్త్రీ మంచం దండీమీద కూర్చుని ఏదో మాట్లాడుతోంది. తనలో తనే మాట్లాడుకుంటూందో, అతనితో నెమ్మదిగా ఏదైనా చెప్తోందో తెలియడం లేదు. కానీ ఇద్దరి మధ్య అసాధారణమైన ప్రేమ, ఆత్మీయత స్పష్టంగా కనిపిస్తోంది. వాళ్లు ఉన్న వాళ్లుగా కనపడ్డంలేదు. అంటే లేనివాళ్లుగా కనపడుతున్నారన్నమాటే.

ఉన్నట్టుండి వార్డులో సంచలనం. విజిటర్సుకి సమయం అయిపోయింది. వార్డులోంచి వెళ్ళిపొమ్మని ఆసుపత్రి సిబ్బంది హెచ్చరిస్తున్నారు. ఇష్టం లేకున్నా తప్పదని రోగుల్ని చూడవచ్చిన బంధుమిత్రులు బాధగా వెళ్లిపోతున్నారు. రైలు స్టేషను విడిచిపెట్టి కూత పెట్టినప్పుడు ఉండే హడావిడి ఆ క్షణంలో అక్కడ కనిపిస్తోంది. అర్ధగంటలో వార్డులోనూ, వరండాలోనూ జనం తగ్గి, మంచం మీద రోగులూ, వాళ్లతో రాత్రి ఉండిపోయే ఆత్మీయులు, రాత్రి డ్యూటీ చేసే ఆసుపత్రి సిబ్బంది మాత్రం మిగిలిపోయారు.

కాత్యాయని ఇంటికి వెళ్లిపోయిన తర్వాత రామంతో ఏవో ముచ్చట్లు చెప్తూ ఉంటే ఎనిమిదిన్నర కావచ్చింది. ఇవ్వవలసిన ఆహారం ఇచ్చి, మాత్రలు వేసుకోమని ఇచ్చాను. రామం కళ్లు నిద్రతో బరువుగా ఉంటే మంచానికి పక్కను ఉన్న జాగాలో నేను దుప్పటీ పరచి కూర్చున్నాను. కొన్ని అనవసరమైన లైట్లు ఆర్పి సిస్టర్ వెళ్ళిపోయింది. ప్రశాంతంగా ఆ వార్డు నిద్రలోకి జోగుతూ ఉంటే నేను నా చేతిలోనికి ఆ రోజు వార్తా పత్రిక తీసి చదివే

ప్రయత్నం చేశాను. కానీ కంటికి శ్రమ పెట్టకుండా చదివేటంత కాంతి నాకు ఆ మంచాల మధ్య క్రీనీడలో దొరకలేదు. అలా కూర్చునే రామం మంచానికి ఆనుకుని మగతలోకి జారుకుంటున్నాను.

నా రెండు చేతులూ ఎవరో పట్టుకున్నట్లయింది. కళ్ళు తెరిచి చూశాను. "భాయి సాబ్ మాఫ్ కర్నా" అంటూ నా కళ్ళలోకి ఎంతో జాలిగా చూసింది ఎదురుగా వంగి నిల్చున్న స్త్రీ.

నల్లని బురఖాలో ఉన్న ఆమె కళ్ల మీద గుడ్డను నుదుటి మీంచి తల మీదకు వేసుకుంది. కళ్లలో ఆవేదన. నేను నిర్దుష్టమైన ఉర్దూ మాట్లాడలేను కానీ, విన్న మాటల్ని అంతో ఇంతో స్పష్టంగానే అర్థం చేసుకోగలను

"నామగడేదో చెప్పలేని బాధతో విలవిలలాడిపోతున్నాడు. నాకు కాళ్లూ చేతులూ ఆడడం లేదు. కాస్త వెళ్లి డాక్టర్ని పిలుచుకురావా!" అని హృదయ విదారకంగా అడుగుతోంది.

నేను లేచి నిల్చున్నాను. రామం ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. గడ్డం పెరిగిన ఆ పొడుగాటి వాడు స్పృహలో ఉన్నాడో, లేడో నేను చెప్పలేను కానీ, అతని మొహంలోని కదలికలు మాత్రం అంతర్గత బాధ తీవ్రతని సూచిస్తున్నాయి. ఆమె మరోమారు భర్త మొహంలోకి చూస్తూ రెండు చేతులు నులుపుకుంటూ అనుకున్న ఆ మాటలు నన్ను ఆశ్చర్యంలో ముంచి వేశాయి. ఈ జీవితంలో మమకారానికున్న ఇరుకైన పరిమితిని చిన్న మాటల్లో క్లుప్తీకరించడం విని అవాక్కయిపోయాను. సృష్టికర్త తెలివి తేటలకి చిన్నగా చురక పెడుతోంది తనకి తెలియకుండానే ఎంతో అమాయకంగా.

"ఆయ్ ఖుదా! తూనే ఇస్కే ముహబ్బత్ దీ హైతో, ఏ ఇఖ్తియార్ భీ దియాహోతా కె మై ఉస్కా దుఃఖ లేలేతీ..."

ఆ మాటలుచెవిని పడగానే ప్రశాంతంగా నా కళ్ల ముందు విస్తరించిన గతంలో ఎక్కడో ఒక గులకరాయి వేసినట్లయింది. ఆ జ్ఞాపకాలు అలలు అలలుగా ఆరేళ్ళప్రాయంలోకి లాక్కుపోతున్నాయి. కానీ అది నీళ్లు నమిలే సమయం కాదు.

నాకు దొరికిన మాటల్లో ధైర్యం చెప్పి డాక్టరు గది వేపు వెళ్లిపోయాను. ఏదో పుస్తకం చదువుకొంటున్న డాక్టరు, తలెత్తి నా వేపు చూశాడు. "మీ రొక్కమారు వచ్చి చూడాలి. రోగి బాధతో విలవిలలాడిపోతున్నాడు.." అన్నాను.

"రామారావా?" అన్నాడు.

"కాదు ఆ పక్క మంచంమీది పొడుగాటి మనిషి" అని నాకు స్ఫురించిన వివరాలు అందించాను.

నిర్లిప్తంగా విన్నాక "ఆ కేసులో మానవ ప్రయత్నం అంతా చేశాం. ఆమెకు ధైర్యం చెప్పడం తప్ప ఇంకేం చెయ్యగలం. అయినా పదండి వస్తాను!" అని నా వెనుకనే వచ్చాడు.

కనుపాపలు చూశాడు. నాడి చూశాడు. ఒక సూది మందిచ్చి, ఆ స్త్రీకి ధైర్యంగా ఉండమని చెప్పి వెళ్ళిపోయాడు. ఐదు నిమిషాల పాటు అక్కడ నిలబడి నాకు తోచిన మాటల్లో ఉపశాంతి వచనాలు పల్కి నా జాగాలో వచ్చి కూర్చున్నాను.

కానీ నా నిద్రకు గట్టిగా ఒక కుదుపు ఇచ్చినట్లయిపోయింది. మరి నిద్ర రాలేదు. నామనసు కొన్ని క్షణాల క్రిందట తెగిపోయిన జ్ఞాపకాల అంచుల్ని పట్టుకుని ఆనాడు అమ్మ మధుసూదనతో బేలగా అన్న మాటలు నెమరువేసుకుంటున్నాను.

అప్పటికి నాకు ఆరేళ్లు నిండాయి. తమ్ముడికి మూడు నిండి నాలుగు వచ్చింది. మధుసూదన ఇంట్లో పనిపాటల్లో అమ్మకు సహాయంగా ఉంటూ వీధి చివర్న ఉన్న బావి నుంచి మా అవసరాలకు కావలసినన్ని నీళ్లు తోడిపోసేవాడు. ఆ కుగ్రామంలో ఏ నీటి సదుపాయమూ ఉండేదికాదు. నాన్నగారు ఊళ్లో లేని సమయంలో తమ్ముడు ఎక్కడో ఆడుకుంటూ ఉంటే కాల్లో మేకు గుచ్చుకుంది. ఆ ఊళ్లో మంచి వైద్యుడుకూడా అప్పుడు లేడు. ధనుర్వాతం వచ్చిందన్నారు. బాధతో తమ్ముడు పక్క లెగరుస్తూ రొప్పుతున్నాడు.

అమ్మవాణ్ణి ఒళ్లో పడుకోపెట్టుకుని చూస్తూ ఏమీ చెయ్యలేక జాలిగామధుసూదనతో ఏదో అంటోంది. "ఇంతింత మమకారంతో దేవుడు వాడినీ, నన్నూ ముడి వేశాడు కదా! మరి వాడి బాధను నేను తీసుకునే అవకాశం ఇవ్వడు చూశావా!" అని సృష్టిలోని అన్యాయాన్ని తలుచుకుంటోంది. ఆ క్షణంలో అమ్మకి దగ్గరగా కూర్చున్నాను నేను. తెలిసీ తెలియని వయసులో నాకు అమ్మ మాటలు కాసింత అర్థమైనాయి. నిజమే అలాటి శక్తి దేవుడు ఎందుకివ్వడో అనుకున్నానుకూడా. నాన్నగారికి టెలిగ్రాం ఇస్తే వచ్చారు. కానీ అప్పటికి చెయ్యగలిగిందేమీ లేకపోయింది.

పక్కనే గొల్లుమని ఏడుపు వినిపించగానే నా జ్ఞాపకాలు తెగిపోయాయి. రామం కూడా నిద్రలేచి ఎక్కడ హడలిపోతాడో, ఏమో అని భయపడ్డాను. ఆ ఏడుపుకి డాక్టరూ, నర్సూ వచ్చారు. రోగి గుండెల మీద అతని బరువంతా వేసి అటూ ఇటూ ఒత్తిడి చేసి డాక్టరు పెదవి విరిచాడు. వెంటనే అచేతనంగా ఉన్న శరీరాన్ని కప్పి ఆ మంచం మీద నుంచి తరలించడం యాంత్రికంగా జరిగిపోయింది. ఆ యువతి తన బురఖా కుట్టు విడిపోయేలాగ చీలుస్తూ వెక్కి వెక్కి ఏడుస్తూ కదలిపోయింది.

తెల్లారి ఐదు గంటలు కొట్టింది గడియారం. కిటికీలో పిచ్చుకల చప్పుడు వినిపిస్తోంది. వార్డులో మెలమెల్లగా చైతన్యం పుంజుకుంది. రామం నిద్రలేచాడు. నేను కిడ్నీ ట్రే పట్టుకుంటే నెమ్మదిగా మొహం కడుక్కున్నాడు. నేను తువ్వాలు అందిస్తూ ఉంటే పక్కనున్న మంచం ఖాళీగా ఉండడం చూసి "అతనేడీ?" అన్నాడు.

"నిన్న రాత్రి నువ్వు నిద్రలో ఉండగా అతన్ని ఇంకో వార్డుకి మార్చారు"-అన్నాను.

"ఓహో! అలాగా!" అని వేడిగా పాలు తాగుతున్నాడు.

ఇంతలోనే నేను వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళి ఫ్లాస్కుని కడిగి వచ్చాను.

"భలేవాడివే సూర్యం! నీది కూడా నాలాగే మొద్దు నిద్ర సుమా!" అన్నాడు రామం.

నేను ఆశ్చర్యపోతూ "ఎందుకలా అంటున్నావు?" అని అడిగాను.

"ఇప్పుడే ఆ నర్సు ఎవరితోనో చెప్తూ ఉంటే విన్నాను. నిన్న రాత్రి ఆ పక్క మంచం మీదున్నవాడు పోయాడట కదా!" అన్నాడు రామం.

ఇక చేసేది లేక- "అలాగా!" అన్నాను.

కానీ, ఇద్దరు అల్పసంతోషులు ఒకేలాగ విలవిలలాడిపోతూ ప్రేమను నిర్వచించడం గురించే నా మెదడింకా ఆలోచిస్తోంది.

(ఆంధ్రప్రభ వార పత్రిక ఆగస్టు 10-16 1994)